ప్రజాశక్తి
మంగళవారం 7 అక్టోబర్ 2025

నిరసన తెలుపుతున్న సిఐటియు, ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ, ఐలు నాయకులు

భూసేకరణపై.. నిరసనాగ్రహం..!

మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావును ముఖ్యమంత్రిని చేసిన నియోజకవర్గం..! రామారావు కుమారుడు నందమూరి బాలకృష్ణను మూడు సార్లు హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా చేసిన నియోజకర్గం..! పసుపు జెండా రెపరెపలు తగ్గకుండా ఆపార్టీని జనం అంటిపెట్టుకున్న నియోజకర్గం..! తెలుగుదేశానికి కవచంలా ఉన్న నియోజకవర్గంలో ఆపార్టీ అధికారంలో ఉన్న సమయంలోనే రైతుల భూములను అప్పనంగా లాగేసే కుట్ర జరుగుతోంది. రైతులకు కనీస సమాచారం ఇవ్వకుండా భూ సేకరణ చట్టం పేరుతో సాగు భూములను తీసుకునేందుకు అధికారులు సిద్ధం అయ్యారు. ఈ విషయం తెలుసుకున్న రైతులు ప్రభుత్వం, అధికారులపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రాణాలు పోయినా భూమిలిచ్చేది లేదంటూ ఆందోళనకు దిగారు.

- హిందూపురం ప్రాంతంలో 2191 ఎకరాల భూసేకరణకు రంగం సిద్ధం
- సాగుభూములు ఇవ్వలేమని తెగేసి చెప్పిన అన్నదాతలు
- గతంలో సేకరించిన భూముల్లో ఏమి ఏర్పాటు చేశారంటూ నిలదీత
- అర్ధాంతరంగా సమావేశాన్ని ముగించి వెనుదిరిగిన అధికారులు

"హిందూపురం రూరల్ మండలం జంగాలపల్లి గ్రామానికి చెందిన మహిళా రైతు ఆది లక్ష్మమ్మకు నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఐదు సంవత్సరాల క్రితం సుమారు 700 మామిడి చెట్లను నాటింది. ప్రస్తుతం ఈ చెట్లు కాపు కాసాయి. ఇలాంటి సమయంలో ఈ భూమిని పరిశ్రమల పేరుతో సేకరించేందుకు ప్రభుత్వం సిద్ధం అయ్యింది. భవిష్యత్తు జీవనాధారం ఉంటుందని రూ.10 లక్షల ఖర్చు చేసి పంట సాగు చేసిన ఆమెకు అధికారులు భూములు తీసుకుంటామని చెప్పడంతో కన్నీటి పర్యవంతం అవుతున్నారు".

హిందూపురం రూరల్ మండలం మలగూరు పంచాయతీ నందమూరి నగర్‌కు చెందిన దళిత సుంకప్ప తనకున్న ఎకరా భూమిలో పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భూ సేకరణ చట్టం అస్త్రాన్ని ఉపయోగించి ఈ భూమిని తీసుకునేందుకు అధికారులు సిద్ధం అయ్యారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ.రామారావు హిందూపురం ఎమ్మెల్యేగా తొలిసారి గెలిచిన 1985వ సంవత్సరంలో దళితుల ఆర్థికాభివృద్ధి నిమిత్తం ఒక్కోక్కరికి ఎకరా భూమి ఇచ్చారు. ప్రస్తుతం ఈ భూమిని లాక్కోనేందుకు ప్రభుత్వం చూస్తోంది.

హిందూపురం రూరల్ మండలం జంగాలపల్లి గ్రామానికి చెందిన నాగమ్మకు భర్త మరణించాడు. భర్తతో పాటు వ్యవసాయం చేసుకుంటున్న ఈమె భర్త మరణాంతరం కూడా తన పొలంలో పంటలు సాగు చేసుకుని కుటుంబానికి తోడుగా ఉంటోంది. ఉన్న ఫలంగా ఆ భూమిని భూ సేకరణ పేరుతో తీసుకుంటామని చెప్పడంతో ఆ కుటుంబం మొత్తం రోడ్డున పడే పరిస్థితి నెలకొంది.

హిందూపురం రూరల్ మండలం మలగూరు గ్రామానికి చెందిన మద్దిలేటి తనకు ఉన్న మూడు ఎకరాల భూమిలో రెండు బోర్లు వేసుకుని పంటలు సాగు చేస్తున్నాడు. ఆ భూమిని తీసుకుంటామని ఇటీవల అధికారులు చెప్పారు. సాగులో ఉన్న భూములు తీసుకుంటే తమకు ఆత్మహత్యలే శరణ్యం అంటూ రైతు మద్దిలేటి ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి- హిందూపురం

శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం రూరల్ మండలం మలగూరు రెవెన్యూ పొలం మలగూరు, చలివెందుల, రాచపల్లి, లేపాక్షి మండలం కొండూరు, సోమందేపల్లి మండలం నడింపల్లి తదితర గ్రామాల పరిధిలో దాదాపు 1118 మంది రైతులకు చెందిన 2191 ఎకరాల భూమిని భూ సేకరణ చట్టం ద్వారా సేకరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. భూమిని దేనికోసం సేకరిస్తున్నారు..? ఎంత భూమి తీసుకుంటున్నారు..? పరిహారం ఎంత ఇస్తున్నారు..? అన్న విషయాలను ఏవీ అధికారులు రైతులకు చెప్పలేదు. అధికారులు కనీసం గ్రామసభను కూడా ఏర్పాటు చేయలేదు. మీ భూములు ప్రభుత్వం తీసుకుంటోంది.. అందుకు సంబంధించిన పత్రాలను తమకు ఇవ్వండి అంటూ అధికారులు రైతులకు చెబుతున్నారు. సోమవారం నాడు నందమూరి నగర్ సాంఘిక సంక్షేమ శాఖ పాఠశాల అవరణంలో రెవిన్యూ అధికారులకు సమావేశం ఏర్పాటు చేసి భూమి పత్రాలు, రైతుల వివరాలు ఇవ్వాలంటూ ప్రకటించారు. ఈ విషయం విన్న వెంటనే రైతులు అధికారులపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

తండ్రి హయాంలో భూ పంపిణీ..

కుమారుని సారథ్యంలో భూ సేకరణ..!

నందమూరి తారకరామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించిన అనంతరం 1985లో హిందూపురం ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొంది ముఖ్యమంత్రి అయ్యారు. తెలుగుదేశం, నందమూరి కుటుబానికి ఓటమి అన్నది లేకుండా ఇక్కడి ప్రజలు గెలిపిస్తూ వస్తున్నారు. ఎన్‌టి.రామారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇక్కడి రైతుల ఆర్థిక జీవన పరిస్థితులను మెరుగు పరిచేసేందుకు సాగు భూములను పంపిణీ చేశారు. ఈ భూములను తీసుకున్న దళిత, బిసి, సన్నచిన్నకారు రైతులు వాటిని చదును చేసుకుని పంటలు సాగు చేస్తున్నారు. ఆ భూమే సర్వశం అని బతుకున్నారు. ప్రస్తుతం ఎన్టీ రామారావు కుమారుడు నందమూరి బాలకృష్ణ హిందూపురానికి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తండ్రి హయాంలో భూమలిస్తే కుమారుని హయాంలో సాగు భూములను లాగేసుకోవడం ఏమిటంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అన్నదాతల ఆగ్రహం.. ఆందోళన

భూములు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు చెప్పగానే ఒక్కసారిగా రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం, అధికారుల తీరును నిరసిస్తూ హిందూపురం- గోరంట్ల ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ ప్రాణాలైనా వదుల ఎకుంటాం.. కుటుంబ జీవనా ధారమైన సాగు భూమిని ఇచ్చేది లేదని ప్రకటించారు. భూ సేకరణ అంబానీ కోసమా...?, ఆదానీ కోసమా అంటూ రైతులు అధికారులపై తిరగబడ్డారు. రైతులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేయడంతో అధికారులు చేసేది లేక అక్కడి నుంచి వెనుదిరిగారు.

రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న రైతులు

రైతులతో కలిసి ఉద్యమిస్తాం

సాగు భూములను ప్రభుత్వం పరిశ్రమల పేరుతో లాగేసుకోవడం సరికాదు. ఏడాదికి మూడు పంటలు పండే 2191 ఎకరాల భూమిని భూ యజమానులకు కనీస సమచారం ఇవ్వకుండా అధికారులు ఎలా తీసుకుంటారు.? భూ సేకరణ చట్టాన్ని అనుసరించి భూమిని సేకరించాలంటే ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. తప్పని సరి భూ సేకరణ అయితే రైతులకు పూర్తి స్థాయిలో పరిహారం, పరిశ్రమల ఏర్పాటు, అక్కడి నిర్వాసిత రైతుల కుటుంబాలకు ఉపాధి తదితర విషయాలను స్పష్టంగా తెలియ జేయాలి. ఇవేవి చేయకుండా బల వంతంగా భూములను లాక్కో వాలని చూస్తే రైతులతో కలిసి అడ్డుకుంటాం.

సిద్దారెడ్డి, రైతు సంఘం నాయకులు.

మత ఉన్మాదంతోనే దాడి

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి హేయం

సిఐటియు, ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ, ఐలు ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-అనంతపురం

మత, కుల ఉన్మాదంతోనే సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడి జరిగిందని ప్రజా, న్యాయవాదుల సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గవాయ్‌పై దాడిని నిరసిస్తూ సిఐటియు, ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ, ఐలు ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం టవర్‌క్లాక్ వద్ద ఆందోళన చేపట్టారు. కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు ఎస్.నాగేంద్ర కుమార్, సతీష్, ప్రసన్న కుమార్, చంద్రిక, పరమేష్ మాట్లాడుతూ సనాతన ధర్మానికి అవమానం జరిగిందన్న పేరుతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సిజెఐ బిఆర్.గవాయ్‌పై మతోన్మాద అడ్వకేట్ రాకేష్ కిషోర్ కోర్టులో అందరూ చూస్తుండగానే చెప్పు విసిరేందుకు ప్రయత్నించడం అత్యంత హేయమైన చర్య అన్నారు. దళిత, గిరిజనులు ఏ స్థాయిలో ఉన్నా మతోన్మాదులు, మనువాదుల నుంచి దాడుల పరంపరం కొనసాగుతోందన్నారు. దేశంలో నెలకొన్న మత ఉన్మాద దుస్థితికి గవాయ్‌పై దాడి ఘటన అద్దం పడుతుందన్నారు. మోడీ పాలనలో మతోన్మాదులు అన్ని వ్యవస్థలనూ మతం పేరుతో ధ్వంసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సనాతన ధర్మం పేరుతో ప్రచారం చేస్తున్న పవన్ కళ్యాణ్ దీన్ని బలపరుస్తారా? వ్యతిరేకిస్తారా.? అన్న దానిపై ప్రజలకు తెలియజేయాలన్నారు. న్యాయవాది ముసుగులో దాడి చేయడం ముమ్మాటికి మతోన్మాద చర్య అన్నారు. ఈ దాడిని ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ఖండించి ప్రజాస్వామి పరిరక్షణకు పూనుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, ఐలు, ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వీరు యాదవ్, ప్రకాష్, హుస్సేన్, ఎం.నాగమణి, గోపాల్, రామాంజనేయులు, చంద్రిక, శ్యామల, అశ్విని, గిరి, భీమేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

దాడి హేయం : సిపిఎం

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడిని సిపిఎం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ అనంతపురం నగర కార్యదర్శి రామిరెడ్డి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సనాతన ధర్మంపై దాడి జరుగుతుందని చెప్పి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై మత ఉన్మాది దాడి చేయడం సిగ్గుచేటన్నారు. నరేంద్ర మోడీ ప్రధానమంత్రి అయిన తర్వాత భారతదేశ వ్యవస్థలన్నింటిపై మతోన్మాద శక్తులు దాడులు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై న్యాయవాది ముసుగులో ఉన్న వ్యక్తి దాడి చేయడం చూస్తే దేశంలో శాంతి భద్రతలు ఏ విధంగా ఉన్నాయో అర్థం అవుతున్నాయని తెలిపారు. నిత్యం సనాతన ధర్మం గురించి చెప్పే ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు ఈ దాడిని ఏ విధంగా చూస్తారో తెలియజెప్పాలని డిమాండ్ చేశారు. మతం ముసుగులో భారతదేశంలో జరుగుతున్న పరిణామాలను ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలని కోరారు.

దాడిని ప్రజలు నిరసించాలి : కెవిపిఎస్

బుక్కరాయసముద్రం : మత ఉన్మాదంతో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై చెప్పు విసేరేందుకు ప్రయత్నించిన మతోన్మాది కిషోర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఓ.నల్లప్ప, జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌లు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తిపై ఇలాంటి దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. అత్యున్నత పదవుల్లో ఉన్నవారికే ఇలాంటి అవమానాలు జరిగితే సామాన్యుల పరిస్థితి ఏమిటన్నారు. బిజెపి పాలనలో సనాతన ధర్మం పేరుతో కుల, మత ఉన్మాదాలు ఎక్కువయ్యాయన్నారు. ఇలాంటి చర్యలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

స్వచ్ఛాంధ్ర అవార్డులు అందజేత

అవార్డులు అందుకున్న వారితో ఎంపీ, జాయింట్ కలెక్టర్, ఇతర అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం నగరంలోని హోటల్ అలెగ్జాండర్‌లో సోమవారం సాయంత్రం స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు – 2025 ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డిఆర్‌ఒ ఎ.మాలోల, జెడ్పీ సిఈఓ శివశంకర్, డిపిఒ నాగరాజునాయుడు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో అనంతపురం జిల్లాకు స్వచ్ఛ జిల్లా అవార్డు – 2025 రావడం గర్వకారణం అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇందులో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ మాట్లాడుతూ స్వచ్ఛ మున్సిపాలిటీ కింద తాడిపత్రి మున్సిపాల్టీకి రాష్ట్రస్థాయి అవార్డు జిల్లా స్థాయిలో వివిధ క్యాటగిరీలకు సంబంధించి మొత్తం 54 అవార్డులు వచ్చాయన్నారు. అనంతరం 15 క్యాటగిరీలలో 54 అవార్డులు పొందిన స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, అయా శాఖల అధికారులు, సిబ్బందికి స్వచ్ఛ ఆంధ్ర అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ పావని, డిఎంహెచ్ఒ డా॥ఈబి.దేవి, సమగ్ర శిక్ష ఎపిసి శైలజతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గుత్తి కోట జెడ్పీ హైస్కూల్‌కు అవార్డు

ప్రజాశక్తి-గుత్తి

ప్రభుత్వం స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా అవార్డులు అందజేసింది. ఇందులో భాగంగా గుత్తి కోటలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు అవార్డు దక్కింది. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుభాన్ అవార్డును అందుకున్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-గుత్తి

విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని ఏపీ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఏపీఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పద్మనాభ పిళ్లైకు ఏపీఎస్‌పి జేఏసీ ఆధ్వర్యాన చేపట్టిన నిరసన దీక్షలు, నిరవధిక సమ్మె నోటీసు, సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు ఎవి.రమణ, జేఏసీ ఛైర్మన్ రాంప్రసాద్, కన్వీనర్ షాషావలి, 1104 డివిజన్ ప్రధాన కార్యదర్శి కె.నాగేంద్ర ప్రసాద్‌లు మాట్లాడుతూ ఏపీ విద్యుత్ సంస్థలో విధులు నిర్వహిస్తున్న 81 వేల మంది శాశ్వత ఉద్యోగులు, ఒప్పంద కార్మికులు, పెన్షనర్లు న్యాయమైన కోర్కెలను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్స్‌పెక్టర్ ప్రహ్లాద, జేఏవో విన్సెంట్ కుమార్, వెంకటేశ్వర్లు, చిన్న, తిరుమల, బాషా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

'చలో తిరుపతి'కి తరలివెళ్దాం : విద్యుత్ శాఖ జెఎసి

గుంతకల్లు : విద్యుత్ శాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని, తదితర డిమాండ్ల సాధన కోసం ఈ నెల 8న తలపెట్టిన చలో తిరుపతి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విద్యుత్ శాఖ జెఎసి అధ్యక్షులు రామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఆలూరు రోడ్డులోని విద్యుత్ శాఖ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం ఎదుట నాయకులు 'చలో తిరుపతి' ప్రచార గోడ పత్రికను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు షాషావలి, రామ్‌ప్రసాద్, మహబూబ్ బాషా, నజీరుద్దీన్, నాగరాజునాయక్, ఎస్‌కెఎం బాషా, కుళ్లాయిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న విద్యుత్ ఉద్యోగులు

పసపల హనుమంత్ రెడ్డికి అవార్డు అందిస్తున్న ఎంపీ

'పసపల' సేవలకు గుర్తింపు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

బుక్కరాయసముద్రం మండలం పసపల ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ తరఫున పసపల హనుమంత్ రెడ్డి, సోదరులు స్వచ్ఛ ఆంధ్ర అవార్డును అందుకున్నారు. అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ చేతుల మీదుగా గౌరవ పురస్కారాన్ని సోమవారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పసపుల బ్రదర్స్ ఎల్లప్పుడూ బడుగు, బలహీన, పేద ప్రజల కోసం కృషి చేస్తున్నారన్నారు. ఆహార పంపిణీ, విద్యా సహాయం, ఆరోగ్య సేవలు, రైతులకు మద్దతు వంటి సేవలతో పసపల బ్రదర్స్ ప్రజల మనసుల్లో ఒక ప్రత్యేక స్థానం సంపాదించారని చెప్పారు.

భవనానికి స్థలం కేటాయించండి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మహిళా సంఘాల సమావేశ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ రైతు మహిళ సంఘం సభ్యులు తహశీల్దార్ శ్రీధర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా సంఘం సభ్యుల సమావేశాలు, పొదపు సమావేశాలు నిర్వహించుకునేందుకు భవనం అవసరం అన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు భవనం కోసం స్థలం కేటాయించి నిర్మాణ పనలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం సభ్యులు లక్ష్మీనారాయణమ్మ, నాగలక్ష్మి, ఆదిలక్ష్మి, అనసూయమ్మ, వసంత లక్ష్మి, ఎర్రమ్మ, నాగలక్ష్మి, సీసీలు పుల్లారెడ్డి పాల్గొన్నారు.

విప్రోవర్క్ ఇంటిగ్రేటెడ్ లర్నింగ్‌కు ఎస్వీ డిగ్రీ కాలేజ్ విద్యార్థి ఎంపిక



విద్యార్థిని ప్రీతిని అభినందిస్తున్న కళాశాల వైస్ ఛైర్మన్, ప్రిన్సిపల్ తదితరులు

అనంతపురం : అనంతపురం ఎస్వీ డిగ్రీ అండ్ పిజి కళాశాల బీఎస్సీ విద్యార్థిని జూటూరు ప్రీతి ప్రముఖ ఐటీ సంస్థ విప్రో (విల్ప్ వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రాం) ఫేజ్–2లో ఎంపిక అయ్యారని ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాల వైస్ ఛైర్మన్ సి.చక్రధర రెడ్డి తెలిపారు. తమకు కళాశాల విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించేందుకు, ప్రఖ్యాత సంస్థల్లో అవకాశం పొందేందుకు తగిన విధంగా శిక్షణ ఇచ్చే ఇస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డా॥ఎన్ఎవి.ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏవో ఎ.శ్రీనాథ్, ప్లేస్మెంట్ అధికారి ఎస్.సాయిరాం పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ దుర్మార్గం

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్న కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. నిర్మాణంలో ఉన్న 10 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను 66 సంవత్సరాల పాటు కారుచౌకగా ప్రయివేటు వారికి కట్టబెట్టడం దుర్మార్గం అన్నారు. మెడికల్ కళాశాలలను ప్రయివేటు పరం చేస్తే పేద, మధ్య తరగతి విద్యార్థులు వైద్య విద్యకు దూరం అవుతాయన్నారు. పిపిపి విధానం గొప్పదంటూ కూటమి నేతలు ప్రచారం చేయడం ప్రయివేటు వ్యక్తుల ఉద్ధరణకే అన్నారు. చివరికి రాజ్యాంగ బద్ధ పదవిలో ఉన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు నర్సీపట్నం కాలేజీ నిర్మాణానికి అనుమతులే రాలేదని చెప్పడం సరికాదన్నారు. కూటమి పాలకులు అవాస్తవాలు, అబద్ధం ప్రచారం ఆపి ప్రయివేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓ.పరమేష్ మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు తరిమెలగిరి, సహాయ కార్యదర్శులు వెంకీ, భీమేష్, హారుణ్ రషీద్, శాంతిరాజ్, నగర నాయకులు సాయి, మహేష్, పరమేష్ పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్న కుమార్

'ఉపాధి' మస్టర్లలో బినామీ పేర్లు..!

కొరవడిన తనిఖీలు.. జేబులు నింపుకుంటున్న టిఎలు, ఎఫ్ఎలు

ప్రజాశక్తి-పుట్లూరు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అందులోని కొందరు ఉద్యోగులకు కల్పతరువుగా మారిందన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. మండలంలో కొందరు టెక్నికల్ అసిస్టెంట్(టిఎ), ఫీల్డ్ అసిస్టెంట్లు(ఎఫ్ఎ) వివిధ రూపాల్లో అక్రమాలకు పాల్పడుతూ జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలు ఇటీవల కాలవలో మరింత ఎక్కువయ్యాయి. అధికారుల కనీస పర్యవేక్షణ కూడా లేకపోవడంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా తమకు అనుకూలంగా ఉన్న వారి పేరుపై జాబ్ కార్డులు సృష్టించి ఆ జాబ్ కార్డులకు సంబంధించిన వ్యక్తులు పనికి వెళ్లకపోయినా కూలీల మస్టర్‌లో పనులకు హాజరైనట్లు చూపి జేబులు నింపుకుంటున్నారని కూలీలే బహిరంగంగా చర్చించుకుంటున్నారు. వాస్తవంగా పని ప్రదేశంలో పది మంది కూలీలు ఉంటే అదనంగా మరో పది మంది బినామీ పేర్లు రాసుకుంటూ టిఎలు, ఎఫ్ఎలు అక్రమంగా దోచుకుంటున్నారు. కొందరు టిఎలు మేజర్ పంచాయతీల్లో తిష్ట వేసి ఇష్టారాజ్యంగా దోచుకుందాం.. దాచుకుందాం.. అనేలా వ్యవహరిస్తున్నారు.

అటకెక్కిన మస్టర్ తనిఖీలు..

ఉపాధి హామీ కూలీల మస్టర్‌ను వారంలో రెండుసార్లు వెరిఫికేషన్ చేయాల్సి ఉంది. అయితే సంబంధిత అధికారులు మండలంలో రెండు మూడు పంచాయతీలు తప్ప మిగతా పంచాయతీల్లో ఏమాత్రం మస్టర్లను వెరిఫికేషన్ చేయడం లేదని తెలుస్తోంది. దీంతో కొందరు టిఎలు, ఎఫ్ఎలు ఇష్టానుసారంగా బినామీ పేర్లు రాసుకొని డబ్బులు దోచుకుంటున్నట్లు సమాచారం. కొందరు టిఎలైతే పై అధికారులు ఎవరొచ్చినా అంతా తాము చూసుకుంటామని ఎఫ్ఎలను అక్రమాలకు ఉసిగొల్పుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. దీంతో ఎఫ్ఎలు పది మంది కూలీలు పనులకు హాజరైతే 20 మంది హాజరైనట్లు మస్టర్లు తయారుచేసి దోచుకుంటున్నారు. ఈ విషయమై ఎపిడి పుల్లారెడ్డిని వివరణ కోరగా ఎంపిడిఒనే వివరణ అడగాలని సమాధానం ఇచ్చారు.

వైద్యుల దీక్షకు రాష్ట్ర ప్రజారోగ్య వేదిక మద్దతు

పిహెచ్‌సి వైద్యుల దీక్షలకు మద్దతు తెలుపుతున్న డా॥వీరభద్రయ్య

ప్రజాశక్తి-అనంతపురం

పిహెచ్‌సి వైద్యుల పట్ల కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధి లేకుండా వ్యవహరిస్తోందని ప్రజారోగ్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ వీరభద్రయ్య ధ్వజమెత్తారు. ఆయన సోమవారం శిబిరాన్ని సందర్శించి వైద్యుల దీక్షకు మద్దతు తెలిపి, ప్రభుత్వ వైఖరి పట్ల నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజారోగ్య వేదిక పిహెచ్‌సి వైద్యులకు అండగా నిలుస్తుందని తెలిపారు. ప్రభుత్వం తక్షణం వైద్యులతో చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వైద్యులకు మద్దతు తెలిపిన వారిలో వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసరావు, నాయకులు పామిడి శ్రీనివాసులు ఉన్నారు.

వినతులపై నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వివిధ సమస్యలపై ఎన్నో వ్యయప్రయాశలకోర్చి అధికారులకు ప్రజలు అందించే వినతులపై నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ సంబంధితాధికారులకు సూచించారు. సోమవారం నాడు కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో జిల్లా అధికారులతో కలిసి 375 అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో పరిశీలిచి వాటికి ఫిర్యాదుదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ మలోలా డిప్యూటీ కలెక్టర్లు రామకృష్ణారెడ్డి, ఆనంద్, తిప్పేనాయక్, శ్రీనివాసులు, మల్లికార్జున, వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


స్వచ్ఛాంధ్ర అవార్డు అందుకుంటున్న డిఎంహెచ్ఒ

జిల్లా స్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డులు ప్రదానం

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాలో అంకిత భావంతో పని చేస్తున్న ప్రభుత్వ శాఖలు, వివిధ విభాగాలను ఉత్తమ అవార్డులకు ఎంపిక చేశారు. అందులో జిల్లా స్థాయిలో వైద్య ఆరోగ్య శాఖ, అనంతపురంలోని హమాలీ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రానికి ఉత్తమ అవార్డులు దక్కాయి. దీంతో సోమవారం నగరంలోని అలగ్జాండర్ హోటల్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈబి.దేవి ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ, ఎంపి అంబికా లక్ష్మీనారాయణ నుంచి ఆ రెండు అవార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి గిరిజా మనోహర్‌రావు, డాక్టర్ సురేంద్రరెడ్డి, హమాలీ కాలనీ వైద్యాధికారి డాక్టర్ సారిక, డెమో నాగరాజు, ఉప డెమో త్యాగరాజు, ఆరోగ్య బోధన అధికారి గంగాధర్, వెంకటేష్, కిరణ్ పాల్గొన్నారు.

యాడికి పంచాయతీకి..

యాడికి : యాడికి గ్రామ పంచాయతీ స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ఉత్తమ అవార్డుకు ఎంపికైంది. దీంతో సోమవారం అనంతపురంలో సర్పంచి పండు అనురాధ, డిప్యూటీ ఎంపిడిఒ, ఇన్‌ఛార్జి పంచాయతీ ఈవో శశికళ ఎంపీ అంబికా లక్ష్మీనారాయ, జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ నుంచి ఉత్తమ పంచాయతీ అవార్డు అందుకున్నారు. యాడికి గ్రామపంచాయతీకి స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా అవార్డు రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో డిపిఒ నాగరాజునాయుడు, డిఆర్ఒ మలోల, జడ్పీ సీఈవో శశిధర్, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు మోడల్ స్కూల్‌కు..

పుట్లూరు : స్వచ్ఛ పాఠశాలల విభాగంలో స్థానిక మోడల్ స్కూల్‌కు జిల్లా స్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డు దక్కిందని ప్రిన్సిపల్ ఓబుల్‌రెడ్డి తెలిపారు. జిల్లా స్థాయిలో స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో భాగంగా ఈ అవార్డు అందుకున్నామని ప్రిన్సిపల్ తెలిపారు. ఈ అవార్డు రావడానికి సహకరించిన పాఠశాల సిబ్బంది, ఆయాలకు కృతజ్ఞతలు తెలిపారు.

స్వచ్ఛాంధ్ర అవార్డు అందుకుంటున్న మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఓబుల్‌రెడ్డి

అండర్-16 చెస్‌లో 'అనంత'కు రన్నరప్ టైటిల్

అనంతపురం : కర్నాటకలోని గోడేహాల్‌లో నిర్వహించిన తిరుమల బ్రెయిన్ ఫోర్స్ ఓపెన్, అండర్-16 చెస్ ఫెస్టివల్-2025లో అనంతపురం జిల్లాకు రన్నరప్ టైటిల్ దక్కింది. అందులో వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 338 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఓపెన్ విభాగంలో 6/7 పాయింట్లతో అనంతపురం జిల్లా సీనియర్ చెస్ కోచ్ అమ్మినేని ఉదయ్‌కుమార్‌నాయుడు రన్నరప్ ట్రోఫీ, రూ. 2,500 నగదు బహుమతిని అందుకున్నారు. 5/7 పాయింట్లతో జొన్నగడ్డల నితీష్ 8వ స్థానంలో నిలిచి ట్రోఫీని బహుమతులు అందుకున్నారు. ఏ-1 చెస్ అకాడమీ క్రీడాకారులు వివిధ కేటగిరీల్లో రాణించి బహుమతులు గెలుచుకున్నారు. అండర్-16లో యు.త్రివేద ప్రథమ స్థానం, అండర్-8లో నిహాల్ తృతీయ స్థానం, అన్విత్ 12వ స్థానం, అండర్-14లో దర్షన్ నాల్గో స్థానం, అండర్-10లో జనని 8వ స్థానం, యంగెస్ట్ ప్లేయర్ శ్రీనిక్ రక్షన్ బహుమతి అందుకున్నారు.

ఎస్సీ, ఎస్టీ ఫిర్యాదుదారులకు న్యాయంచేయండి

కళ్యాణదుర్గం టౌన్ : వివిధ వర్గాల నుంచి వివక్ష, దాడులు ఎదుర్కొంటున్న ఎస్సీ, ఎస్టీ ఫిర్యాదు దారులకు సత్వరం న్యాయం చేయాలని ఎస్సీ, ఎస్టీ జెఎసి తాలుకా అధ్యక్షులు చెలిమప్ప కోరారు. ఈ మేరకు సోమవారం ఆ సంఘం నాయకులు గంగాధర్, నాగరాజు, ప్రభాకర్, వన్నూర్‌స్వామి, మల్లేష్, తదితరులు ఆర్డీఓ వసంతబాబు, డీఎస్పీ రవిబాబుకు వేర్వేరుగా అర్జీలు సమర్పించారు. ఎస్సీ, ఎస్టీ ఫిర్యాదుదారులకు ఇంతవరకూ ప్రభుత్వం నుంచి అందాల్సిన పరిహారాలు అందలేదన్నారు. అలాగే ఐదుకల్లు గ్రామానికి చెందిన దళిత నాగార్జునపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బాలికోన్నత పాఠశాలలో 'సురక్ష'

కళ్యాణదుర్గం రూరల్ : పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో 'సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. పోలీసు అధికారులు గంజాయి, మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రయోజనాలను వీడియోల ద్వారా వివరించారు. అలాగే గుడ్ టచ్-బ్యాడ్ టచ్ గురించి తెలిపారు. పోలీసు శాఖలో పని చేస్తున్న రాము, హెచ్ఎం వనజ మాట్లాడుతూ బాలికలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇక్కడ అవగాహన పొందిన విషయాలను కుటుంబ సభ్యులతో చర్చించి వారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పిఇటి చల్లా కిరణ్ చౌదరి, ఉపాధ్యాయులు మూర్తి, కృష్ణారెడ్డి, భాగ్యమ్మ, విజయ్‌కుమారి, అరుణ, ప్రశాంతి, వెంకటేశులు, ప్రభావతి, ప్రసన్న పాల్గొన్నారు.

11న ఎంటిఎస్ ఉపాధ్యాయుల 'చలో విజయవాడ'

బ్రహ్మసముద్రం : 98-డీఎస్సీ ఉపాధ్యాయుల సమస్యలపై ఈ నెల 11వ తేదీ తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని 98-డీఎస్సీ ఎంటిఎస్ ఉద్యోగుల జిల్లా జాయింట్ సెక్రటరీ రామాంజ నేయరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని వేపులపర్తి గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీరంగనాథ స్వామి ఆలయంలో సోమవారం గుమ్మగట్ట, బ్రహ్మసముద్రం మండలాల్లో పనిచేస్తున్న 98 డీఎస్సీ మిత్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించి అజెండాలో అంశాలపై చర్చించారు. రామాంజనేయరెడ్డి మాట్లాడుతూ ఎంటిఎస్ ఉపాధ్యాయుల హక్కుల కోసం విజయవాడలో నిర్వహించతలపెట్టిన ధర్నాకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో పని చేస్తున్న ఎంటిఎస్ టీచర్లందరూ హాజరుకావాలన్నారు.

కనకదాసు జయంతిని ఘనంగా నిర్వహిద్దాం

కళ్యాణదుర్గం రూరల్ : నవంబర్ 8వ తేదీ కనకదాసు జయంతిని ఘనంగా నిర్వహిద్దా మని కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోరంపల్లి ఆంజనేయులు, కురుబ సంఘం గౌరవాధ్యక్షులు దురదకుంట దొణస్వామి పిలుపునిచ్చారు. పట్టణంలోని కనకదాసు కళ్యాణ మండపంలో సోమవారం నియోజకవర్గ కురుబ సంఘం అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన నియోజకవర్గ కురుబ సామాజిక వర్గం ప్రజలతో సమావేశం నిర్వహించారు. ముందుగా కనకదాసు చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఆంజనేయులు, దొణస్వామి మాట్లాడుతూ నవంబర్ 8వ తేదీ కళ్యాణదుర్గంలో రాష్ట్రస్థాయి కనకదాసు జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నందున, కురుబలు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో డికె.రామాంజ నేయులు, నీలాస్వామి, సంఘం నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

'కాపు' ఇంట సందడి

డి.హీరేహాల్ : మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి జన్మదినం సందర్భంగా సోమవారం మండలంలోని హిర్దేహాల్ క్రాస్ వద్ద ఉన్న ఆయన నివాసం వద్ద సందడి వాతావరణం నెలకొంది. ముందుగా అభిమానులు పెద్ద కేక్ కట్ చేసి పంచి పెట్టారు. అలాగే పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున అక్కడికి చేరుకుని పూలబొకేలు ఇచ్చి కాపు రామచంద్రారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రాయదుర్గం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కాపు అభిమానులు రోగులకు పండ్లు, బ్రెడ్లు, భోజనం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వార్డు సభ్యులు గోవిందు, వన్నూరప్ప, షబ్బీర్, నాయకులు నాగిరెడ్డి, ఆత్మానంద, నాని, హరిత, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు

గ్రీవెన్స్ అర్జీలకు సత్వర పరిష్కారం : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం

అర్జీల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయొద్దని, చట్టపరిధిలో వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలని ఎస్పీ పి.జగదీష్ పోలీసు అధికారులను ఆదేశించారు. నగరంలోని జిల్లా పోలీసు కాన్ఫరెన్స్ హాలులో సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఎస్పీ ప్రజల సమస్యలు విని అర్జీలు స్వీకరించారు. మొత్తం 88 అర్జీలు అందా యి. కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, రస్తా తగాదాలు, తదితర సమస్యలపై ఫిర్యాదులు ఎక్కువగా వచ్చాయి. ఆయా సమస్యలపై ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. చట్టపరిధిలో సత్వర న్యాయం అందించాలని, ఏమాత్రం ఆలస్యం చేయరాదని ఆదేశించారు. చట్టపరమైన చర్యలు తీసుకున్న వెంటనే వివరాలతో కూడిన నివేదికలను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని సూచించారు. కార్యక్రమంలో అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులను సన్మానించిన ఎస్పీ జగదీష్

ఉద్యోగ విరమణ పోలీసు అధికారులకు సత్కారం

సుదీర్ఘకాలం సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన ఇద్దరు ఎస్ఐలు, మహిళా ఎఎస్ఐలకు సోమవారం ఎస్పీ పి.జగదీష్ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు పలికారు. జిల్లా స్పెషల్ బ్రాంచి ఎస్ఐ లోకనాథ్‌చౌదరి, ట్రాఫిక్ ఎస్ఐ విజయభాస్కర్‌రాజు, అనంతపురం రూరల్ ఎఎస్ఐ వరలక్ష్మి ఉద్యోగ విరమణ పొందారు. వీరిని సోమవారం నగరంలోని స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ పి.జగదీష్, పోలీసు అధికారులు, సిబ్బంది పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్క రించారు. ఎస్పీ మాట్లాడుతూ కుటుంబ సభ్యుల తోడ్పాటు వల్లనే మీరు సుదీర్ఘ కాలం పోలీసు శాఖలో విధులు నిర్వర్తించి, సర్వీసును విజయవంతంగా పూర్తి చేశారన్నారు. ఇతర ప్రభుత్వ శాఖల కంటే పోలీస్ శాఖలో ఉద్యోగ విరమణ అనేది ప్రత్యేకం అన్నారు. భవిష్యత్తులో ఏ అవసరం ఉన్నా పోలీసు శాఖ తోడుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, ఆర్ఐ మధు, జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలనాధికారి రవిరామ్‌నాయక్ , జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, గాండ్ల హరినాథ్, లక్ష్మీనారాయణ, సరోజ, తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుల కుటుంబాలకు చేయూత

ఇటీవల మృతి చెందిన ముగ్గురు హోంగార్డులతో పాటు ఉద్యోగ విరమణ పొందిన ఇద్దరు హోంగార్డుల కుటుంబాలకు సోమవారం ఎస్పీ పి.జగదీష్ ఆర్థిక సాయం అందజేశారు. ఇందులో భాగంగా ఒక రోజు వేతనం అందజేసిన హోంగార్డులను ఎస్పీ అభినందించారు. అనారోగ్యంతో మృతిచెందిన లక్ష్మిరెడ్డి భార్య కళావతికి రూ. 19,880, నరసింహులు భార్య వరలక్ష్మికి రూ. 5,11,200, తిరుపాల్ నాయక్ భార్య శాంతమ్మకు రూ. 31,800 అందజేశారు. అలాగే ఉద్యోగ విరమణ పొందిన నూర్ మహమ్మద్‌కు రూ. 5,09,780, క్రిష్ణవేణికి రూ. 53,400 విలువ చేసే చెక్కులను ఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఐ జాఫర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డిటి ఎఫ్‌సిఆర్ఎ రెన్యువల్ కోసం

8 నుంచి సామూహిక దీక్ష

సిపిఐ రాష్ట్ర నాయకులు డి.జగదీష్

ప్రజాశక్తి-గుంతకల్లు

ఆర్‌డిటి సంస్థకు విదేశీ నిధులు కాకుండా అడ్డుకుంటున్న కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం, హోం శాఖ వైఖరిని నిరసిస్తూ ప్రత్యక్ష పోరాటాలు చేస్తామని సిపిఐ రాష్ట్ర నాయకులు డి.జగదీష్ స్పష్టం చేశారు. పట్టణంలోని బిటి పక్కీరప్ప భవనంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్‌డిటి సంస్థ ఉమ్మడి అనంతపురం జిల్లాలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు వివిధ రంగాల్లో విశేష సేవలు అందిస్తుందన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఆ సంస్థకు మతం రంగు పూసి విదేశీ నిధులు రాకుండా అడ్డుకోవడం దుర్మార్గం అన్నారు. ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్ఎను రెన్యువల్ చేయాలని ఇప్పటికే వామపక్ష పార్టీలతో పాటు అన్ని రాజకీయ పార్టీలు వివిధ రూపాల్లో వత్తిడి తెచ్చినా కేంద్ర ప్రభుత్వం, హోం శాఖ నిర్లక్ష్యం చేస్తోందన్నారు. దీంతో కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా స్వామ్యవాదులు, ప్రజా, కుల సంఘాలను కలుపుకుని ఈ నెల 8వ తేదీ నుంచి స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సామూహిక దీక్షలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.గోవిందు, ఎఐటియుసి జిల్లా నాయకులు మహేష్, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, మండల కార్యదర్శి రాము, సహాయ కార్యదర్శి ఎస్ఎండి.గౌస్, తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు

తైక్వాండో ఎంపిక పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

జిల్లాలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ తైక్వాండో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు విజయవంతంగా ముగిశాయని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. ఈ పోటీలకు వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజరై ప్రతిభను చాటారు. ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ శివయ్య, రిటైర్డ్ డిఎస్‌డిఒ రమణ హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు. పరిశీలకులు ప్రభాకర్, టెక్నికల్ కన్వీనర్ కె.శాంతరాజ్, ఎస్‌జిఎఫ్ కార్యదర్శులు శ్రీనివాసులు, శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని, నరసింహారెడ్డి(ఎపిఎస్ఎపి రాష్ట్ర అధ్యక్షుడు) సమన్వయంతో కార్యక్రమం సజావుగా సాగింది. అండర్-14 బాలుర విభాగంలో బి.మనోజ్‌సాయి, ఎస్.భాగ్యరన్, కె.లోకేష్, ఎన్.గౌతమ్, ఎస్.స్మితబాన, ఆర్.గణేష్, రాహుల్‌క్రిష్ణ, ఎం.మహ్మద్, ఎం.ప్రషిత్. అండర్-17లో ఆర్.క్రిష్ణ, పి.బాలాజి, వి.శ్రీధర్, డి.శ్రీకాంత్, ఎం.మహేష్, పి.ప్రసాద్, ఎస్.మహేష్, ఎం.రాజేష్, వి.లోకేశ్వర్‌రావు, జి.శ్రీనివాస్, సి.లోకేశ్వరరావు, ఎస్.నవీన్, పి.కిరణ్. అండర్-17 బాలికల విభాగంలో ఎల్.భవాని, కె.తరిణి, డి.సాయినిషా, డి.శ్రావణి, పి.పుష్ప, జి.సతీశ్వరి, పిటి.సౌజన్య, ఎస్.ఎక్తా, టి.నిషా, డి.యామిని, ఎం.మంజుల ఎంపికయ్యారు. వీరు రాబోయే రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని ఆయన తెలిపారు.

నాగరాజును సన్మానిస్తున్న ఎంపిహెచ్ఇఒ, సిహెచ్ఒ అసోసియేషన్ సభ్యులు

డెమో నాగరాజుకు సన్మానం

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తూ ఇటీవల ఉద్యోగోన్నతి పొందిన డెమో నాగరాజును సోమవారం పలువురు సన్మానించారు. డెమో నాగరాజును ఎంపిహెచ్ఇఒ, సిహెచ్ఒ అసోసియేషన్ తరపున పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.లక్ష్మన్న, సెక్రటరీ మోహన్‌బాబు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఖరీఫ్ ఈ క్రాప్ నమోదు గడువు పొడిగింపు

ప్రజాశక్తి-పుట్లూరు/శింగనమల

ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటల నమోదు(ఈ క్రాప్) గడువును ఈ నెల 25వ తేదీ వరకూ పొడిగించినట్లు పుట్లూరు, శింగనమల మండలాల వ్యవసాయ అధికారులు కాత్యాయని, అన్వేష్‌కుమార్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి తాము సాగు చేసిన పంటలను నమోదు చేయించుకోవాలని సూచించారు. వరి, మొక్క జొన్న, వేరుశనగ, కంది, పత్తి, తదితర పంటల కొనుగోలుకు ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరి అన్నారు.

20లోపు ఈ క్రాప్ బుకింగ్ పూర్తవ్వాలి : తహశీల్దార్

ప్రజాశక్తి-బెళుగుప్ప

ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన వివిధ పంటలకు సంబంధించి ఈ నెల 20వ తేదీ లోగా ఈ క్రాప్ బుకింగ్‌ను పూర్తి చేయాలని తహశీల్దార్ బి.అనిల్ కుమార్ అధికారులకు సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం వ్యవసాయ అధికారులు, వీఆర్వోలతో సమావేశం నిర్వహిం చారు. తహశీల్దార్ మాట్లాడుతూ ఖరీఫ్ ఈ క్రాప్ బుకింగ్‌ను త్వరగా పూర్తి చేయాలన్నారు. తగ్గుపర్తి, దుద్దేకుంట, ఎర్రగుడి గ్రామాల్లో ఎలాంటి తప్పులు లేకుండా రీ సర్వే చేయాలని సర్వేయర్లకు సూచిం చారు. సమావేశంలో ఏవో పృథ్వీసాగర్, డిప్యూటీ తహశీల్దార్ మధు, ఆర్ఐ నగేష్‌బాబు, వీఆర్వోలు రమేష్‌స్వామి, ఈశ్వర్‌రెడ్డి, ఎర్రిస్వామి, చంద్రశేఖర, శ్రావణి, మధుసూదన్, సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సెలూన్ తొలగింపుపై కౌన్సిల్‌లో తీర్మానం చేయండి

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలో ఏర్పాటు చేసిన కార్పొరేట్ సెలూన్ షాపులను తొలగించేలా కౌన్సిల్‌లో తీర్మానం చేయాలని కోరుతూ సోమవారం పట్టణ నాయీబ్రాహ్మణులు మున్సిపల్ ఛైర్‌పర్సన్ భవానికి వినతిపత్రం ఇచ్చారు. క్షవర వృత్తిదారుల సంఘం పట్టణ అధ్యక్షుడు బెలగంటి లక్ష్మినారాయణ మాట్లాడుతూ క్షవర వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న నాయీ బ్రాహ్మణుల జీవనోపాధికి అడ్డంకిగా మారిన కార్పొరేట్ సెలూన్ షాపులను తొలగించాలని కోరారు. ఈ విషయంపై కౌన్సిల్ తీర్మానం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి సూరి, కోశాధికారి బ్రహ్మ, నాయకులు శంకర్, నీలాకుమార్, అజయ్, నరేష్, బాలకృష్ణ, అంజి, గోవిందు, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు తగినంత యూరియా ఇవ్వాలి

శింగనమల : మండల వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులకు సకాలంలో తగినంత యూరియా సరఫరా చేయాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గ్రీవెన్స్‌లో తహశీల్దార్ శేషారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. భాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వం యూరియా, జిప్సం, జింక్, బోరాన్, నీళ్ల మందులు, ఎరువులను అన్ని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని కోరారు. రీ సర్వే చేసిన గ్రామాల్లో ఆన్‌లైన్‌లో వన్-బి, అడంగల్ రాక, జాయింట్ ఎల్‌పి తీసివేయక పంట నమోదు ప్రక్రియలో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. 5 వారాలుగా ఉపాధి హామీ కూలీలకు బిల్లులు అందలేదన్నారు. రాచేపల్లి గ్రామంలోని చెప్పులు, తోళ్ల పరిశ్రమను పున:ప్రారంభించి నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. సలకంచెరువు గ్రామచెరువులో ముళ్లపొదలు తొలగించాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్, కొండారెడ్డి, శ్రీనివాసులు, సుంకన్న, ఎర్రిస్వామి, రామాంజనేయులు, రామకృష్ణ, పెద్దన్న, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రాంగణంలో ముళ్లపొదలు తొలగింపు

శింగనమల : ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని చిన్న జలాల పురం పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. పాఠశాల ప్రాంగణంలో ముళ్లపొదలు ఏపుగా పెరగడంతో పాటు చెత్త పేరుకుపోయి అపరిశుభ్రంగా మారడంతో పాములు సంచరించేవి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళనలకు గురయ్యేవారు. ఈ విషయాలను స్థానిక టిడిపి నాయకుడు సుధాకర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేయించాలని ఆదేశించడంతో సోమవారం టిడిపి నాయకులు సుధాకర్ ఓ జెసిబిని ఏర్పాటు చేయించి ముళ్లపొదలు, చెత్తను తొలగించారు.

ముళ్లపొదలు తొలగిస్తున్న సుధాకర్

కడవకల్లులో పోషణ మాసోత్సవాలు

పుట్లూరు : మండలంలోని కడవకల్లు-1 అంగన్వాడీ సెంటర్‌లో సోమవారం ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగమణి ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఇందులో ఈసీసీఈ డే, పూర్వ ప్రారంభ విద్య గురించి ప్రజలకు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో 3 నుంచి 5 ఏళ్ల పిల్లలకు ఆట పాటలతో విద్య, మధ్యాహ్న భోజనం అందిస్తామని వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు జయలలిత, గాయత్రి, లక్ష్మీదేవి, లక్ష్మికాంత పాల్గొన్నారు.

చౌక దుకాణం తనిఖీ

బెళుగుప్ప : బెళుగుప్పలోని చౌకదుకాణం-4ను సోమవారం డిప్యూటీ తహశీల్దార్ మధుసూదన్ రావు సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేసే నిత్యావసర సరుకులను కార్డుదారు లకు సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. తూకాల్లో అవకతవకలకు పాల్పడవద్దని, అధిక ధరలు వసూలు చేయవద్దని హెచ్చరించారు. స్కేల్ సక్రమంగా ఉందా లేదా అని సరి చూశారు. స్టాక్ ఎంత ఉంది, ఎంత పంపిణీ చేశారని డీలర్‌ను అడిగి తెలుసుకున్నారు. కాసేపు లబ్ధిదారులతో ముచ్చటించారు. కార్డుదారుల నుంచి ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐ నగేష్‌బాబు, విఆర్ఒ శ్రావణి, తదితరులు ఉన్నారు.

రేషన్‌షాపును తనిఖీ చేస్తున్న డిప్యూటీ తహశీల్దార్

సమస్యలు పరిష్కరించాలని యానిమేటర్ల వినతి

బెళుగుప్ప : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం యానిమేటర్లు ఎపిఎం సురేఖకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ బకాయి వేతనాలు చెల్లించాలని, 5జి మొబైల్, సిం కార్డులు ఇవ్వాలని, ఆన్‌లైన్ పని భారాన్ని తగ్గించాలని, కనీస వేతనాలు చెల్లించాలని, హెచ్‌ఆర్ పాలసీ, రూ. 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ అమలు చేయాలని, అర్హులైన వారికి సీసీలుగా ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. రెండేళ్ల ఇన్సెంటివ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలపై అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యానిమేటర్లు ధనలక్ష్మి, తిమ్మక్క, వన్నూరుస్వామి, లక్ష్మీబాయి, తదితరులు పాల్గొన్నారు.

దళితులకు భూ పంపిణీ చేయండి

బొమ్మనహాల్ : మండలంలోని బొమ్మనహాల్, సింగేపల్లి, గోవిందవాడ, కొలగానహల్లి, గోనేహాల్, శ్రీధరఘట్ట, లింగదహాల్, ఉద్దేహాల్, సిద్దరాంపురం, బొల్లనగుడ్డం, కళ్లుహోల, హొన్నూరు, ఉప్పరాల గ్రామాల్లో భూమిలేని నిరుపేద దళితులకు భూ పంపిణీ చేయాలని కోరుతూ సోమవారం భారతీయ అంబేద్కర్ యువసేన అధ్యక్షులు పవన్ ఆధ్వర్యంలో తహశీల్దార్ మునివేలుకు అర్జీ ఇచ్చారు. పవన్ విలేకరులతో మాట్లాడుతూ పేదలైన దళితులు, భూమి లేని నిరుపేదలను ప్రభుత్వం గుర్తించి భూ పంపిణీ చేస్తే వారి జీవన విధానం మారుతుందని తెలిపారు. కార్యక్రమంలో నరసింహులు, హనుమంతు, వన్నూరప్ప, శివన్న, ఆయా గ్రామాల దళితులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కేశవరెడ్డి స్కూల్‌లో చోరీ

బుక్కరాయసముద్రం : కేశవరెడ్డి స్కూలులో డబ్బుల బాక్సులు ఎత్తుకెళ్లిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. సోమవారం నాడు ప్రిన్సిపాల్ అరుణ కళాశాలకు వచ్చి చూడగా డబ్బుల పెట్టె ఎత్తుకెళ్లిన విషయం గుర్తించారు. దీనిపై ఆమె బుక్కరాయసముద్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిఐ పుల్లయ్య సిబ్బందితో కేశవరెడ్డి పాఠశాలను సందర్శించి వివరాలు సేకరించారు. దాదాపు రెండు లక్షల రూపాయల నగదు ఉన్నట్లు ప్రన్సిపల్ పోలీసులకు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి గాయాలు

గుత్తి : మండలంలోని కరిడికొండ గ్రామం 44వ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఉబిచెర్ల గ్రామానికి చెందిన కళ్యాణ్ గుత్తి నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. కరిడికొండ గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై రాయల్ డాబా వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్ర గాయాలైన ఆ యువకున్ని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రెండు నెలలైనా ఆచూకీ తెలియని విద్యార్థి

నార్పల : మండలంలోని నడిమిదొడ్డి గ్రామానికి చెందిన దాడితోట శివయ్య, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు దాడితోట పవన్ కళ్యాణ్ రెండు నెలల క్రితం అదృశ్యమయ్యాడు. వివరాలు.. పవన్‌కళ్యాణ్ కేసేపల్లి జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదివి పాసయ్యాడు. ఆ తర్వాత ఇంటర్మీడియట్ విద్య కోసం విజయవాడలోని ఓ కళాశాలలో చేరాడు. ఆగస్టు 3వ తేదీ విజయవాడ రైల్వే స్టేషన్ నుంచి స్వగ్రామం నడిమిదొడ్డికి బయల్దేరాడు. నంద్యాల రైల్వేస్టేషన్‌లో రైలు దిగినట్లు సీసీ కెమెరాల్లో నమోదైంది. దాని ఆధారంగా పవన్ కళ్యాణ్ తల్లిదండ్రులు నంద్యాల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. రెండు నెలలు దాటినా కుమారుని ఆచూకీ లభ్యం కాకపోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. కరపత్రాలు ముద్రించి పవన్‌కళ్యాణ్ ఆచూకీ తెలిస్తే తెలపాలంటూ పంచుతున్నారు.

పిడిఎస్ బియ్యం పట్టివేత

అనంతపురం : రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు కలిసి కూడేరు మండలంలోని జల్లిపల్లి గ్రామం వద్ద ప్రభుత్వ చౌక బియ్యాన్ని పట్టుకున్నారు. వారు సోమవారం ఉరవకొండ-అనంతపురం ప్రధాన రహదారిపై జల్లిపల్లి గ్రామం వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఓ బొలెరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో 14.6 క్వింటాళ్ల(41 బ్యాగులు) పిడిఎస్ బియ్యంను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. వాహనంతో పాటు బియ్యాన్ని కూడేరు సిఎస్‌డిటి బి.శాంతకుమారికి స్వాధీనం చేశారు. అనంతపురంలోని తపోవనంకు చెందిన వాహన డ్రైవర్ దూదేకుల బాబు పారిపోయాడని, అతడిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా రేషన్ బియ్యంను అక్రమంగా సేకరించడం, నిల్వ ఉంచడం, ఇతర ప్రదేశాలకు తరలించి వ్యాపారం చేస్తే కఠిన చర్యలు తప్పవని అధికారి ప్రసాద్ హెచ్చరించారు. తనిఖీల్లో సిఐ జమాల్‌బాషా, సిఎస్‌డిటి శాంతకుమారి, విఆర్ఒ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

యల్లనూరు : పలు కేసుల్లో నిందితులుగా ఉండి, మండల పోలీసు స్టేషన్‌లో రౌడీషీటర్లగా ఉన్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ రామాంజనేయరెడ్డి కౌన్సెలింగ్ ఇచ్చారు. గ్రామాల్లో ఎలాంటి గొడవల జోలికెళ్లకుండా ప్రశాంత జీవనం గడపాలని తెలియజేశారు. గొడవలు, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ నారాయణ రెడ్డి, సిబ్బంది శంకర్ నారాయణ, నవీన్, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం బస్టాండ్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

బస్టాండ్‌లో ప్రయాణికుల నిరీక్షణ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

దసరా సెలవులు ముగియడంతో విద్యార్థులు, ఉద్యోగులు, బంధువులు సోమవారం ప్రయాణానికి సిద్ధమయ్యారు. వివిధ ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులు చదువుల కోసం, దసరా పండుగకు పల్లెటూర్లకు వచ్చిన బంధువులు వారి వారి ప్రాంతాలకు వెళ్లేందుకు కళ్యాణదుర్గం ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నారు. అయితే బస్సులు రద్దీగా వెళ్లడం ఒక ఎత్తు కాగా సర్వీసులు సకాలంలో రాకపోవడంతో విద్యార్థులు, ఇతర ప్రయాణికులు బస్సు సర్వీసుల కోసం బస్టాండ్‌లో వేచి చూశారు. గంటల తరబడి బస్సుల కోసం నిరీక్షించి చివరకు ఆర్టీసీ అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్టాండ్‌లోనే కాకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లే పలు బస్టాపులలో కూడా ఇలాంటి పరిస్థితే కనిపించింది.

డ్రగ్స్ దుష్పరిణామాలపై అవగాహన

అనంతపురం : రూరల్ మండలంలోని తపోవనం జడ్పీ హైస్కూల్‌లో సోమవారం 'డ్రగ్స్ వద్దు బ్రో' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈగల్ వింగ్ ఎస్ఐ హనుమంత విద్యార్థులకు ఈగల్ సంస్థ స్థాపన ఉద్దేశ్యం, రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఆపరేషన్ గరుడా, ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్, రైళ్లలో ప్రత్యేక తనిఖీల వివరాలను తెలిపారు. మత్తు పదార్థాల వాడకంతో కలిగే శారీరక, మానసిక నష్టాలు, ఎన్‌డిపిఎస్ చట్టంలోని కఠిన శిక్షలు, ఆస్తి జప్తు విధానాలను వివరించారు. స్కూల్ పరిసరాల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయించడం నేరమని తెలిపారు. ప్రతి స్కూల్‌లో ఈగల్ క్లబ్ ఏర్పాటు అవసరాన్ని తెలిపారు. డ్రగ్స్, మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే 1972 లేదా 89777 81972 వాట్సాప్ నంబర్‌కు తెలపాలన్నారు. అనంతరం విద్యార్థులు ఏకకంఠంతో 'డ్రగ్స్ వద్దు బ్రో' అని నినదించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈగల్ సోషల్ మీడియా ప్లాట్ ఫామ్‌లను స్కాన్ చేసి సబ్‌స్క్రైబ్ చేసుకున్నారు.

డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఈగల్ సభ్యులు

ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేస్తే సహించం : టిడిపి

ప్రజాశక్తి-ఆత్మకూరు

ఎమ్మెల్యే పరిటాల సునీతపై నిరాధారణమైన ఆరోపణలు చేస్తే సహించబోమని టిడిపి మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు, నాయకులు కేశవ, కందులు ఓబుళపతి, కురుబ ఆదినారాయణ హెచ్చరించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లా డుతూ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యే పరిటాల సునీతపై చేసిన అసత్య ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. నియోజకవర్గంలో వైసిపి పాలనలో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఆయన సోదరులు చేసిన దౌర్జన్యాలు, అక్రమాలు, అరాచకాలు అన్నీ ఇన్నీ కావన్నారు. ప్రధానంగా జగనన్న లేఅవుట్లలో మీరు చేసిన అవినీతి గురించి అందరకీ తెలిసిందే అన్నారు. మీరు చేసిన అవినీతి, అక్రమాల వల్ల హౌసింగ్ అధికారులు సస్పెండ్‌కు గురైన విషయం, కాంట్రాక్టర్లను బెదిరించడం, నిర్బంధించడం నిజం కాదా అని ప్రశ్నించారు. అమ్మ పాల డెయిరీ పేరుతో పాడి రైతుల నుంచి మీరు చేసిన వసూళ్ల సంగతేంటని నిలదీశారు. ఇలా చెప్పుకుంటూ పోతే మీ అరాచకాలు చాలానే ఉన్నాయన్నారు. ఇకపై మా ఎమ్మెల్యేపై నిరాధార ఆరోపణలు చేస్తే మీరు నియోజకవర్గంలో తిరగకుండా చేస్తామని హెచ్చరించారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు